వేర్వేరు స్టేషన్లుగా గ్రేటర్ జిల్లాలు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా రంగారెడ్డి, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలను వేర్వేరు స్టేషన్లుగా చూపించాలని ఆర్థికశాఖ ఉత్తర్వులిచ్చింది. దీంతో అక్కడి వారు ఇక్కడికి.. ఇక్కడి వారు అక్కడికి బదిలీ అయ్యే అవకాశం దొరికింది. రెండు జిల్లాలకు చెందిన కార్యాలయాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉంటే మాత్రం, జీహెచ్ఎంసీ లోనే అంతర్భాగంగా పరిగణిస్తారు. జీహెచ్ఎంసీ బయట ఏ జిల్లాలో ఉంటే ఆయా జిల్లా స్టేషన్‌గా పరిగణిస్తారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ సీఎస్‌ను కలిసి నిబంధనను మార్చాలని కోరారు. స్పందించిన సర్కారు వేర్వేరు స్టేషన్లుగా పరిగణనలోకి తీసుకుంటూ ఉత్తర్వులిచ్చింది.

దేవాదాయ శాఖ ఈవోలకు ఉద్యోగోన్నతి

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : దేవాదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఆరేండ్లుగా సర్వీస్ రూల్స్, సీనియారిటీ విషయంలో జాప్యం కారణంగా ఉద్యోగోన్నతిలో ఇబ్బందులు తలెత్తాయి. తాజాగా సమస్య పరిష్కారంతో 11 మంది ఈవోలకు లబ్ధి చేకూరింది. ముగ్గురు గ్రేడ్-3 ఈవోలు గ్రేడ్-1గా, 8 మంది గ్రేడ్-3 ఈవోలు గ్రేడ్-2గా ఉద్యోగోన్నతి పొందారు. ఇందుకు మంత్రి కొండా సురేఖకు ఆలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బేతి రంగా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పదోన్నతుల్లో నిబంధనలు పాటించాలి

తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలల ఉద్యోగుల సంఘం

హైదరాబాద్, జూలై12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఏండ్ల తరబడిగా ఎదురుచూస్తున్న అర్హులైన డిగ్రీ లెక్చరర్లకే ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించాలని తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలల ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శారద, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సత్యశ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అనధికార అర్చక బదిలీలు!

- ఎండోమెంట్ యాక్ట్‌కు దేవాదాయ శాఖ తూట్లు
- ఉత్తర్వులు లేకుండా మౌఖిక ఆదేశాలతో ప్రక్రియ
- స్థానచలనం చట్ట విరుద్ధమంటున్న సంఘాలు
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరికలు

వేములవాడ/వేములవాడ టౌన్, జూలై 12: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ అర్చకులపై కత్తిగట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఆలయ అర్చకులనూ బదిలీ చేయాలని నిర్ణయించింది. ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆలయాల్లో పనిచేసే అర్చకులు సదరు ఆలయ విశిష్టత సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించాల్సి ఉండటంతో బదిలీ చేయరాదనే నిబంధన ఉన్నా ఏ మాత్రం లెక్కచేయకుండా ముందుకుసాగుతున్నది. ఇది సరైన పద్ధతి కాదని, నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

బదిలీలు చట్ట విరుద్ధం

దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఎండోమెంట్ యాక్ట్ 87, సెక్షన్ 142 ప్రకారం ఆలయాల్లో పనిచేసే అర్చకులను బదిలీ చేయరాదనే నిబంధన ఉన్నది. ఎక్కడికక్కడ ఆలయాల్లో ఉన్న విశిష్టత సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించాల్సి ఉన్నందున అదే ఆలయంలో పనిచేయాలని చట్టంలో ఉన్నది. బదిలీలకు నిబంధనలు అడ్డువస్తాయని భావిస్తున్న అధికారులు, అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వకుండా మౌఖిక ఆదేశాలతో పూజారుల్లోనూ 40 శాతం బదిలీల వ్యవహారం తెరమీదికి తేవడం కలకలం రేపుతున్నది. బలవంతంగా బదిలీల కోసం ఆప్షన్లు అడుగుతుండటంతో కలవరపడుతున్నారు. అర్చకుల విధుల్లో ఏదైనా తప్పిదాలు జరిగితే ఎక్కడికక్కడే చర్యలు తీసుకోవాలి. కానీ, ఇతర దేవాలయాలకు బదిలీ చేయడం ద్వారా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్టే అవుతుందని అర్చక సంఘాలు తప్పుపడుతున్నాయి.

ఒక్కో ఆలయంలో ఒక్కో విధంగా పూజలు

రాష్ట్రంలోని ఒక్కో ఆలయానికి ఒక్కో విశిష్టత ఉన్నది. అక్కడి సంప్రదాయం ప్రకారం అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాంచరాత్రా ఆగమం, భద్రాచలం సీతారాములస్వామి వారి ఆలయంలో పాంచరాత్రాఆగమం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో చాత్తాద వైష్ణవం, బాసర సరస్వతీ దేవి ఆలయంలో స్మార్త సంప్రదాయం, కొమురవెల్లి మల్లికార్జున ఆలయంలో వీరశైవ గొల్ల, కురుమ వ్యవస్థ ద్వారా పూజలు జరుగుతుంటాయి. వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారికి సుప్రభాతం మొదలుకొని ఏకాంత సేవ వరకు విశేష పూజలు, ఉత్సవాలు జరుగుతుంటాయి. మాసశివరాత్రి రోజు 3 గంటలు మహా లింగార్చన, శుక్ర, సోమవారం ప్రత్యేక కీర్తనలతో ఏకాంత సేవ ఉంటుంది.ప్రాతఃకాల పూజ పౌరాణిక స్తోత్రాలు, వైదిక విధానంతో కూడిన ప్రదోష పూజ, నిషి పూజ మొదలైన విధానాలు ఉంటాయి. ఈ పూజా విధానాలు దేవాదాయ శాఖ వారు నిర్వహించే ఆగమ పరీక్షల సిలబస్‌లో కనిపించదు. ఇక రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రతి శుక్రవారం చతుష్షష్టి ఉపచార పూజ రెండువేళలా విశేషంగా జరుగుతుంది. రాజన్న క్షేత్రం హరిహర క్షేత్రంగా పిలవబడుతుంది. ఇక్కడ స్వామివారితోపాటు సీతారామచంద్రస్వామి, లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారికి పున్నర్వసు, రేవతి నక్షత్రములందు పంచోపనిషత్ ద్వారా మహాభిషేకం పూజలు నిర్వహిస్తారు. శివకల్యాణం పాంచాహ్నిక ధ్వజారోహణ విధానంలో, రామ కల్యాణం ప్రత్యేకమైన విధానంతో నిర్వహిస్తారు. అన్న పూజ, ఆకు పూజలు చేపడతారు. ఈ పూజా విధానాలు సిలబస్ రూపంలో ఎక్కడా ఉండవు.

వేములవాడలోని కైంకర్యాలు ఎక్కడా ఉండవు

ఏ ఆలయమైనా ఆ గుడి సంప్రదాయాలు, ఆ ప్రాంత విశిష్టతలకు అనుగుణంగా ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఇది వేల సంవత్సరాల తరబడిగా వస్తున్న ఆనవాయితీ. అలా పూజలు చేసే అర్చకులను మరో ప్రాంతానికి బదిలీ చేయడం అనేది సరైన పద్ధతి కాదు. అలా చేయడం కూడా ఆలయ సంప్రదాయాలకు తిలోదకాలిచ్చినట్టే. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే కైంకర్యాలు దేశంలోనే ఎక్కడా ఉండవు.

- గోపన్నగారి శంకరయ్య, రిటైర్డ్ స్థానాచార్యులు, రాజన్న ఆలయం, వేములవాడ

ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

అర్చక బదిలీలు ధర్మ విరుద్ధం. దేవాదాయ శాఖ చట్టంలోనే అర్చక బదిలీలపై నిబంధన ఉన్నది. ఏ క్షేత్రానికి అనుగుణంగా అక్కడి సంప్రదాయాన్ని అనుసరించిన పూజా విధానాలు ఉంటాయి. బదిలీలతో వాటి విశిష్టతను కోల్పోయే ప్రమాదం ఉన్నది. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా మౌఖిక ఆదేశాలతో అర్చక ఉద్యోగులను బలవంతంగా ఆప్షన్లు అధికారులు అడుగుతున్నారు. అర్చక బదిలీల ప్రక్రియను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. రాజన్న దేవాలయంలో ఖాళీగా ఉన్న అర్చకుల పోస్టులను భర్తీ చేయకుండా బదిలీ చేయడాన్ని తప్పుపడుతున్నాం. బదిలీలు కొనసాగితే వేములవాడ అనువంశిక అర్చక సంఘం తరపున ఆందోళనకు దిగుతాం.

- ప్రతాప రామకృష్ణ, అనువంశిక అర్చక సంఘం అధ్యక్షులు, వేములవాడ

మైనర్‌పై పోలీసుల కాల్పులు

నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద డెకాయిట్ ఆపరేషన్

మారణాయుధాలతో నిందితుల దాడి • పోలీసుల కాల్పులు.. మరొకరు అరెస్టు

సుల్తాన్‌బజార్, జూలై 12: హైదరాబాద్ నడిబొడ్డున శాంతిభద్రతలు విఫలం అయ్యాయి. నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అర్ధరాత్రి కాల్పులు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఈ మధ్య రాత్రిపూట రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న ప్రయాణికుల సెల్‌ఫోన్లు, బ్యాగులు, పర్సులు, నగదు చోరీ చేస్తున్నట్టు సమాచారం అందటంతో నాంపల్లి పోలీసులు, సెంట్రల్‌జోన్ పోలీసుల సంయుక్తాధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత డెకాయిట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించటంతో పోలీసులు ప్రశ్నించారు. వారు తప్పించుకొనేందుకు మారణాయుధాలతో పోలీసులపై దాడికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు ఆత్మరక్షణ కోసం వారిపై కాల్పులు జరిపారు. ఇందులో మైనర్ బాలుడి తొడకు బుల్లెట్ తగిలింది. దీంతో అతడిని ఉస్మానియా దవాఖానకు తరలించి, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నామని నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు తెలిపారు. మల్లేపల్లి మాంగార్‌బస్తీకి చెందిన వారిద్దరు అనేక కేసుల్లో నిందితులుగా ఉన్నారని వెల్లడించారు. దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులపై దాడికి నిందితులు ఉపయోగించిన గొడ్డలి

బ్రాహ్మణ సంక్షేమం అగమ్యగోచరం

మొదటిపేజీ తరువాయి...

బ్రాహ్మణుల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటును ఇవ్వాలనే సహృదయంతో కేసీఆర్ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తును ప్రారంభించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిషత్తు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. విద్య, స్వయం ఉపాధి, వేదవిద్యకు ప్రోత్సాహం కోసం అమలు చేసిన వివిధ పథకాలు ఆగిపోవడం విచారకరమని వెల్లడించారు. రాష్ట్రంలో అసలు బ్రాహ్మణ పరిషత్తు ఉన్నట్టా? లేనట్టా? అన్న ఆందోళన బ్రాహ్మణుల్లో నెలకొన్నదని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలోని తమ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కోసం ఏటా రూ.100 కోట్లు క్రమం తప్పకుండా కేటాయించిందని గుర్తుచేశారు.స్వామి వివేకానంద పేరుతో విదేశీవిద్యానిధి పథకం, శ్రీరామానుజ పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, వేదహిత పేరుతో వేద పాఠశాలలు, వేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రతి నెల వేద శాస్త్ర పండితులకు గౌరవ వేతనం, ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఆర్థికప్రోత్సాహం, బ్రాహ్మణ యువతకు పోటీ పరీక్షల శిక్షణ వంటి పథకాలను అమలుచేసి ఎంతోమంది పేద బ్రాహ్మణ కుటుంబాల్లో వెలుగులు నింపామని వివరించారు. విదేశీవిద్యానిధి పథకం కింద 780 మంది పేద బ్రాహ్మణ విద్యార్థుల కోసం రూ.20 లక్షల చొప్పున కేసీఆర్ సర్కారు ఖర్చు చేసిందని, 436 మంది విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్ అందించిందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకంగా 5,074 మందిని గుర్తించి రూ.150 కోట్ల ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. బ్రాహ్మణుల గౌరవాన్ని పెంచేలా దేశంలోనే తొలిసారిగా, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలో రూ.12 కోట్లతో 10 ఎకరాల విస్తీర్ణంలో విప్రహిత బ్రాహ్మణ సదన్ నిర్మించి, బ్రాహ్మణ సంక్షేమంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్కారు పరిష్కరించాల్సిన సమస్యలను లేఖలో ప్రస్తావించారు. ఆ వివరాలివీ..

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు గతంలో మాదిరిగానే నిధులు విడుదల చేయాలి. వార్షిక బడ్జెట్‌లో ఏటా రూ. 100 కోట్లు కేటాయించాలి. బ్రాహ్మణ పరిషత్తు పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.
- విదేశీవిద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకొని, ఎంపికైన 300 మంది విద్యార్థులు ఇప్పటికే విదేశాల్లో చదువుతున్నారు. వారికి స్కాలర్‌షిప్స్ అందకపోవటంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన రూ.30 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలి. 2023-24కిగానూ ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న 344 మంది విద్యార్థులకు తక్షణమే ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి.
- బ్రాహ్మణ ఆంత్రప్రెన్యూర్ స్కీం ఆఫ్ తెలంగాణ (బెస్ట్) కింద దరఖాస్తు చేసుకొని, ఎంపికైన 497 మందికి రూ.16 కోట్లు విడుదల చేయాలి. 706 మందికి ఫిజికల్ వెరిఫికేషన్ పూర్తి చేసి, 2023-24కి దరఖాస్తు చేసుకున్న 1,869 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించాలి.
- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తులో పనిచేస్తున్న ఉద్యోగులకు 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి.
- వేద పాఠశాలల్లోని వేద పండితులకు 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.5 వేల గౌరవ వేతనాన్ని తక్షణం చెల్లించాలి.
- 75 ఏండ్లు పైబడిన వేద పండితులకు ఇచ్చే రూ.5 వేల భృతి 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వారికి ఆర్థిక చేయూత ఎంతో అవసరం కాబట్టి వెంటనే చెల్లించాలి.
- సూర్యాపేట, ఖమ్మం, మధిరలో నిర్మించతలపెట్టిన బ్రాహ్మణ సదనాల పనులు ఆగిపోయాయి. వాటిని వెంటనే పూర్తి చేయాలి.

కోస్గి ప్రభుత్వ దవాఖానలో బైఠాయించిన బీఆర్ఎస్ నేతలు

సీఎం ఇలాకాలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- కోస్గి ప్రభుత్వ దవాఖానలో రోగులను పట్టించుకోని వైనం
- రోగికి సెలైన్ పెట్టిన వాచ్‌మన్.. బీఆర్ఎస్ నేతల ఆందోళన

నారాయణపేట (కోస్గి), జూలై 12: సీఎం ఇలాకాలో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నేత శాసం రామకృష్ణ కొడుకు అస్వస్థతకు గురయ్యాడు. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్య సిబ్బంది ఎవరూ బాలుడిని పరీక్షించలేదు. వాచ్‌మన్ మాత్రం సెలైన్ ఎక్కించాడు. వైద్యులు ఎవరూ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రామకృష్ణ.. కుమారుడిని ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లాడు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు వెంకటనర్సింహులు, హన్మంత్, తాయప్పతోపాటు పలువురితో దవాఖానకు చేరుకొని బైఠాయించారు. రెండు గంటల ఆందోళన చేపట్టగా దవాఖాన ఇన్‌చార్జి డాక్టర్ అనుదీప్ వచ్చి విషయం తెలుసుకొని నైట్‌డ్యూటీలో ఉన్న డాక్టర్, నర్సులు, సిబ్బందికి మెమోలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రామకృష్ణ ఆందోళన విరమించాడు. కార్యక్రమంలో నాయకులు చైతన్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

చేరినచోటే పాతుకుపోయారు!

- డీఎంఈలో దశాబ్దాలుగా 'బదిలీ' ఎరుగని డాక్టర్లు
- ఒకే మెడికల్ కాలేజీలో తిష్టవేసిన బోధన సిబ్బంది
- దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారి జాబితా విడుదల

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు దశాబ్దాలుగా అక్కడే తిష్టవేశారు.కనీసం పక్క దవాఖానకు కూడా బదిలీ కాకుండా.. చేరిన చోటే పాతుకుపోయారు. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా డీఎంఈ పరిధిలో దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్నవారి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆ జాబితాలో అనేక మంది ప్రొఫెసర్లు దశాబ్దాలుగా హైదరాబాద్‌కే పరిమితం అయినట్టు స్పష్టం అవుతున్నది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ దవాఖానల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరి అసోసియేట్ ప్రొఫెసర్లుగా, ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినా అక్కడే పాతుకుపోయిన వారు పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం. దీం తో తమకు అన్యాయం జరుగుతున్నదని ఇత ర ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్నిసార్లు బదిలీలు చేపట్టినా పైరవీలు చేయించుకొని అక్కడే ఉండిపోతున్నారని ఆరోపిస్తున్నారు. కొందరు తమ భార్య/భర్త హైదరాబాద్‌లో పనిచేస్తున్నారని కారణాలు చెప్తున్నారని, మరికొందరు తాము స్పెషాలిటీ వైద్యులమని, ఇతర ప్రాంతాలకు పంపితే అక్కడ ఈ సేవలు అందించే వెసులుబాటు లేదనే సాకులుచూపుతున్నారని చెప్తున్నారు. సంఘాల పేర్లు చెప్పుకొని, కూర్చున్న సీట్లోనే దశాబ్దాలుగా కొనసాగుతున్నవారు ఎంతోమంది ఉన్నారని పేర్కొంటున్నారు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటూ ప్రైవేట్ ప్రాక్టీస్ కూడా చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, వీరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయటం ఎవరి తరం కావటం లేదన్న అభిప్రాయం వైద్యవర్గాల్లో బలపడిపోయింది. వారు హైదరాబాద్‌కే పరిమితం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న నిపుణులకు నగరానికి వచ్చి, అత్యాధునిక వసతు ల మధ్య చికిత్స అందించే అవకాశం లేకుండా పోతున్నదనే అభిప్రాయం ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో నాలుగేండ్లకుపైగా ఒకే చోట పనిచేస్తున్నవారిలో 276 మంది ప్రొఫెసర్లు ఉన్నారు. వీరిలో 40 శాతం చొప్పు న అంటే 198 మందిని బదిలీ చేయాల్సి ఉన్నది. గతంలో మెడికల్ కాలేజీల సంఖ్య తక్కువగా ఉన్నది కాబట్టి వాళ్లు ఇక్కడే తిష్టవేసినా పెద్దగా పట్టించుకోలేదని, ఇప్పుడు మెడికల్ కాలేజీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఈ ప్రభుత్వమైనా మార్చుతుందా? అని గ్రామీణ ప్రాంతాల్లోని డాక్టర్లు ఎదురుచూస్తున్నారు.

- ఉస్మానియా దవాఖానలో నెఫ్రాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కిరణ్మయి ఇస్మాయిల్ 32 ఏండ్లుగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె 1992లో ఉద్యోగంలో చేరగా, పక్క హాస్పిటల్‌కు కూడా మారలేదు.
- గాంధీ దవాఖానకు చెందిన కార్డియాలజీ ప్రొఫెసర్ నితిన్‌కుమార్ 1994లో ప్రభుత్వ ఉద్యోగంలో చేరగా, 30 ఏండ్లుగా అదే దవాఖానకు పరిమితమయ్యారు.
- నిలోఫర్ దవాఖానకు చెందిన అనస్థీషియా ప్రొఫెసర్ సాధనరాయ్ 26 ఏండ్లుగా అక్కడి నుంచి కదలలేదు.
- ఉస్మానియాలో గ్యాస్ట్రో ఎంటరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వాసిఫ్ అలీ 1994లో ఉద్యోగంలో చేరగా, 30 ఏండ్లుగా అక్కడే కొనసాగుతున్నారు.
- గాంధీ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మురళీధర్ 25 ఏండ్లుగా అదే దవాఖానకు పరిమితమయ్యారు.

- సరైన పరిహారం కోసం రైతుల రిలే దీక్ష

కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు చేపట్టనున్న కాళేశ్వరం కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన బాటపట్టారు. శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే దీక్షకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించాలని, భూమికి బదులు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, నాయకులు చంద్రశేఖర్, భిక్షపతి, మైసయ్యయాదవ్ పాల్గొన్నారు. – నర్సాపూర్

- నిండు గర్భిణీ నడవాల్సిందే!

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం గౌరాపూర్ పరిధిలోని చిత్తబట్టా గ్రామంలో గర్భిణి పంద్ర శ్రీదేవికి నెలలు నిండాయి. ప్రసవం కోసం ఉట్నూర్ సర్కారు దవాఖానకు తీసుకెళ్లడానికి ఆశ కార్యకర్త లక్ష్మి గ్రామానికి వచ్చారు. చిత్తబట్టా నుంచి గౌరాపూర్ వరకు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడం, మధ్యలో వాగు ఉండటంతో అంబులెన్స్ రావడానికి ఇబ్బందిగా ఉంది. దీంతో గర్భిణి శ్రీదేవి గౌరాపూర్ వరకు కిలోమీటర్ దూరం కాలినడకన వెళ్లింది. అక్కడి నుంచి ఆశ కార్యకర్తతో కలిసి ఇంద్రవెల్లికి ఆటోలో చేరుకున్నది. – ఆదిలాబాద్

రేషన్ బియ్యం కోసం వెళ్లి మృతి

- 3 కిలోమీటర్లు నడిచి ప్రాణాలొదిలిన వృద్ధురాలు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలలో విషాదం

జయశంకర్ భూపాలపల్లి, జూలై 12 (నమస్తే తెలంగాణ): రేషన్ బియ్యం కోసం ఇంటి నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ షాపునకు నడిచి వెళ్లి వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దులోని పలిమెలలో జరిగింది. జయశంకర్ భూపాపల్లి జిల్లా పలిమెల మండలం బోడాయిగూడెంకి చెందిన కాపుల పోషక్క (65) రేషన్ బియ్యం కోసం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలిమెలకు నడుచి వెళ్లింది. దాహం వేయడంతో రేషన్ షాపు పక్కనే ఉన్న ఇంటి వద్ద కూర్చుని నీళ్లు తాగి కుప్పకూలిపోయింది. చుట్టుపక్కల వాళ్లు వచ్చి ఆమెను దవాఖానకు తరలించేలోపే మృతి చెందింది. గ్రామస్థులు వృద్ధురాలి మృతదేహాన్ని బోడాయిగూడేనికి తరలించారు. పోషక్క కొన్నేండ్ల క్రితం పంకెన గ్రామం నుంచి పలిమెలకు వలస వచ్చి తన అక్క దగ్గర ఉంటున్నది. ఆమెకు దగ్గరి బంధువులు ఎవరూ లేరని, అంత్యక్రియలు చేయడానికి సైతం దిక్కు లేని పరిస్థితి అని తెలిపారు.

కరెంటు షాక్‌తో ప్రైవేట్ కార్మికుడి మృతి

- విద్యుత్తు సిబ్బందిపై గ్రామస్థుల దాడి
- కుటుంబానికి ఆదుకోవాలని ధర్నా
- 6గంటలు స్తంభంపైనే మృతదేహం
- జనగామ జిల్లా వనపర్తిలో ఉద్రిక్తత

లింగాలఘనపురం, జూలై 12: కరెంటు షాక్ తగిలి ఓ ప్రైవేట్ విద్యుత్తు కార్మికుడు స్తంభంపైనే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం వనపర్తిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి గ్రామంలో విద్యుత్తు సరఫరాలో తలెత్తిన లోపాన్ని సరిచేసేందుకు జేఎల్ఎం సురేశ్‌నాయక్ అభ్యర్థన మేరకు సబ్‌స్టేషన్ ఆపరేటర్ రవి వనపర్తి ఫీడర్‌లో కరెంటు సరఫరాను నిలిపేశాడు. ప్రైవేట్ కార్మికుడు కుక్కల మల్లేశ్ (35) గ్రామంలోని కరెంటు స్తంభాన్ని ఎక్కి లోపాన్ని సరిచేస్తుండగా.. మర్రితండా ఫీడర్‌లో విద్యుత్తు సరఫరా ఉండటంతో మల్లేశ్ విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే ప్రాణాలు వదిలాడు. సిబ్బంది అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే మల్లేశ్ మృతి చెందాడని గ్రామస్థులు తీవ్రఆగ్రహానికి గురయ్యారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తరలించొద్దని అడ్డుకున్నారు. విద్యుత్తు సిబ్బందిపై దాడిగి దిగి నిరసన చేపట్టారు. ఆరు గంటలపాటు మృతదేహం స్తంభంపైనే ఉండిపోయింది. స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ బీబ్ శర్మ పోలీస్ సిబ్బందితో వనపర్తికి చేరుకొని విద్యుత్తు అధికారులు, గ్రామస్థులతో చర్చించారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పరిహారం ఇచ్చేలా ఒప్పం దం కుదరడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సైలు చింత రాజు, నరేశ్‌తో పాటు డివిజన్‌లోని పోలీసులు గ్రామంలోకి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. మృతుడికి భార్య భాగ్యమ్మ, కూతురు శ్రుతి, కుమారుడు చరణ్ ఉన్నారు.

విద్యుత్ స్తంభంపై మల్లేశ్ మృతదేహం

చిట్టీల వ్యాపారి వేధింపులు.. వాచ్‌మన్ ఆత్మహత్య

ప్రగతినగర్‌లో కరెంటువైరు పట్టుకుని బలవన్మరణం

మూసాపేట, జూలై12: చిట్టీల వ్యాపారి వేధింపులతో మనస్తాపం చెంది ఓ వాచ్‌మన్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. కూకట్‌పల్లి సీఐ ముత్తు, ఎస్సై ప్రేమ్‌సాగర్ కథనం ప్రకారం.. మూసాపేట ప్రగతినగర్‌లోని శ్రీసాయికృష్ణ క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కనకరాజు కుటుంబం